


## సమకాలీన సమస్యలపై వ్యంగ్యాస్త్రాల పరంపర!!

3

### *చావటానికెందుకురా తొందర!*

చావనేది లేకుండా ఉండటానికి పూర్వకాలంలో రాక్షసులు కూడా ఘోర తపాలు చేస్తుండేవారు. అమృతం కోసమేగా అంతలావు వైరాన్ని కూడా పక్కన పెట్టి దేవదానవులు క్షీరసాగర మథనానికి దిగింది! మహాత్ములు కోరుకుంటే తప్ప మృత్యుదేవత దగ్గరికి రాదని మన నమ్మకం. భారతంలోని భీష్మాచార్యులవారు స్వచ్ఛంద మరణాన్ని వరంగా పొంది ఉన్నా.. తన కర్తవ్యం పూర్తయిన దాకా అంపశయ్య వదిలి పారిపోలేదు. బ్రహ్మంగారివంటి సిద్ధులు కూడ తమ పాత్ర పూర్తయిన పిదపే కదా సజీవ సమాధి కావటానికి సిద్ధపడ్డారు! - మృత్యుపాశాన్నుంచి తప్పించుకునే దానికి భక్తమార్కండేయుడు పడిన తాపత్రయమంతా తెలిసి కూడా మరి ఈనాటి యువతరం ప్రాణాలు తీసుకోటానికి అంతగా ఎందుకు ఉబలాటపడుతున్నదో అంతుబట్టకుండా ఉంది. కాటికి కాలుజాచుకున్న ముసలివాళ్ళైనా మనుమల మునిమనుమల పెళ్ళిపేరంటాలు చూసిగాని హరీ అనమని మొడికేస్తున్న రోజుల్లో పసిమొగ్గలు అలా ఊరికే ఉసూరు తీసుకోవటం ఉసూరుమనిపించే విషయం.

యాండీ రూనే అనే ఆంగ్ల రచయిత చావును గూర్చి ఓ తమాషా వ్యాసం రాసాడు 'నువ్వు ఫలానా రోజున పైకి పోబోతున్నావ'న్న సమాచారం ఉన్న కవరు మెయిల్లో గనక వస్తే ఆ కవరు తెరవడానికి కూడా ఎవరూ సాహసించర'ని ఆయనగారి థీరీ. తప్పక తెరిచి చూడాల్సి గనక వస్తే.. చావు ఘడియ దగ్గర పడిందని తెలిసిన ఆ అభాగ్యుడు చివరి క్షణాల్లో ఎంత విచిత్రంగా ప్రవర్తిస్తాడన్నదే ఆ వ్యాస సారాంశం. నవ్వు పుట్టిస్తుంది. కాని నిజానికి ప్రాణాలు పోవడం, తీసుకోవడం అంత నవ్వులాట వ్యవహారం కాదుకదా!

చావు దగ్గర పడినవాడు పెళ్ళాం బిడ్డల్ని గూర్చి తల్లిదండ్రులను గూర్చి ఆందోళన పడకుండా ఉండగలడా! తన తదనంతరం కూడా వాళ్ళ బ్రతుకులు చల్లగా సాగాలని ఎంతగా తాపత్రయపడతాడు. డబ్బున్న వాడైతే వివాదాలకు తావులేకుండా వీలునామా రాసి పడేస్తాడు. ఏఏ ఆస్తిపాస్తుల పత్రాలు ఏ ఏ బ్యాంకులాకర్లలో మూలుగుతున్నాయో అంత బాధలో కూడా ముక్కుతూ మూలుగుతూనన్నా దగ్గరివారికి చెప్పుకుంటాడు. పిల్లకాయల చదువులు, పెళ్ళిళ్ళు మంచి వాళ్ళ పిల్లలకు పేర్లు పెట్టేదాకా తామేం కావాలనుకుంటునారో ఓ టైం టేబుల్లాగా వేసి మరీ ఒప్పగింతలు పెడతారు. కుటుంబం యావ అంతగాలేని పడమటి దేశాల్లో వాడు కూడా చావు దగ్గర పడిందని తెలిస్తే ఉన్న కాడికి క్రెడిట్ కార్డు లిమిటంతా గుట్టుగా వాడేసుకుని మరీ గుటుక్కుమనాలని చూస్తాడని యాండీ భావన.

ఎలాగూ పోతున్నాం కదా అని ఇంతకాలం ఉగ్గబట్టుకున్న మందూ, సిగిరెట్లూ మళ్ళీ మొదలు పెట్టే వాళ్ళు కొందరంట జుత్తు కత్తిరించుకునే పనిమాత్రం అందరూ భయంగా మానేస్తారుట. ఇష్టమైన పబ్బులు, సినిమాలు ఎంతదూరంలో ఉన్నా వెళ్ళి చూసి తరించాలని ఉవ్విళ్ళూరే వాళ్ళుకొందరంట. తిండియావ ఉన్న వాళ్ళైతే మూడు పూటలా మేత కార్యక్రమం తప్ప మరో పనిపెట్టుకోరని యాండీ ఉద్దేశం. ఏదేమైనా ఫ్యునరల్ ఏర్పాట్లు సొంతంగా చేసుకునే అదృష్టం మాత్రం ఆ దురదృష్ట జీవుల కొక్కళ్ళకే సొంతం గదా. ఇరుగు పొరుగులు బాగా అసూయపడే విషయం మాత్రం ఇదొక్కటే అంటున్నాడు యాండీ రూనే. వృధా కారణాలకు ప్రాణాలు తీసుకునేవాళ్ళకు  కనీసం ఆ సుఖం కూడా ఉండదు. ఎంత విషాదం!

నిజానికి ప్రాణాలు తీసుకోడం ప్రాణాలు పోయినంత బాధగా ఉంటుంది. ఇంతకాలం ఎంతో శ్రద్ధగా పెంచి పోషించిన తోటను, కుక్కపిల్లను వదిలి పోవాలే అన్న బాధ తప్ప మరే జంజాటం లేని సన్నాసి కూడా తెల్లవారి ప్రాణాలు పోతాయంటే తెల్లవార్లూ కుమిలి కుమిలి ఏడవకుండా ఉండగలడా? చేతిలో చిల్లిగవ్వలేని వాడైనా, అన్నీ మంచం మీదే తప్ప చేయలేని జీవైనా చచ్చిపోయే ముందు సంతోషంతో గంతులేస్తాడంటే నమ్మలేం. ఎన్ని బాధలు పడేవాడైనా వచ్చే జన్మలో ఏ బిల్ గేట్సు కొడుగ్గా పుట్టాలనో, ఒబామా తరువాత అధ్యక్షుడు కావాలనో హాలీవుడ్ హీరోగానో బాలివుడ్ హీరోయిన్ గానో, అదీ మన ఇండియాలో అయితే ఏ గాంధీ ఫ్యామిలీతోనో, గాలి కుటుంబంలో నలుసుగానో పుట్టాలని కోరుకుంటాడేగాని అవుట్ రైట్‌గా అసలే జన్మవద్దు పొమ్మని చచ్చినా అనుకోడు. మరలాంటప్పుడు చేతిలో ఉన్న ఇప్పటి విలువైన జన్మను వదులుకోడమెందుకు.. విడ్డూరం కాకపోతే!

ఇవాళ ఏ పేపరు తిరగేసినా, టీవీ ఛానెల్ తిప్పి చూసినా చావు వార్త ఒక్కటైనా లేకుండా చల్లంగా గడుస్తున్న ఒక్క పూటైనా ఉండడం లేదు! ఓపికున్న వాళ్ళెవరైనా ఓసారి ఈ చావు లెక్కలు తీయగలిగితే భూమి పుట్టినప్పటి నుంచీ ఇప్పటిదాకా పోయిన వాళ్ళే ఉన్నవాళ్ళకన్నా ఎక్కువని  లెక్కతేలుతుంది. అంతు తెలియనిరోగాలతో, ఆహారలోపాలతో గర్భస్రావాలతో, పురిటి బాధలతో , ఫ్యాక్షనిస్టుల కార్పణ్యాలతో కాలుష్యాలతో,  వడదెబ్బలతో, పరువు హత్యలతో, హరీ హరీ ... హరమనే వారి సంఖ్య రోజు రోజుకు మరీ అలా పోతూనే ఉంది. ఇప్పుడదనంగా కొత్తగా సొంతంగా ప్రాణాలు తీసుకోవటం కూడా పెరిగిపోతుంటే ప్రకృతి సమతుల్యమే దెబ్బతిని బ్రతికి ఉన్నవారికి చచ్చే చావే!

రైతు పురుగు మందు తాగితే పంట మళ్ళీ చిగురిస్తుందా? ఆకలికి తాళలేక చెట్టుకురేసుకుంటే ఆ నేత పనివాడి కుటుంబానికి మేత మళ్ళీ దొరుకుతుందా? గొంతునులుముకున్నంతమాత్రాన అప్పుల బాధలు ?.... తీరిపోతాయా?... బ్రతికున్న వాళ్ళని పట్టి పీడించవా? ఉద్యోగం పోయిందని, వైద్యం అందటంలేదని, ప్రమోషన్ రావటం లేదని, వ్యాపారంలో లాసయిందని, పరీక్షపోయిందని, ప్రేమించిన వాళ్ళు ఛీ అన్నారని ఫ్రెండ్స్ ర్యాగింగ్ చేసారని, టీచర్లు మందలించిందని ఆరాధ్య నేత కనిపించకుండా మాయమయ్యాడని, ఇష్టమైన నాయకుడు పోలీసు కష్టడీలో కెళ్ళాడని, ప్రత్యేక రాష్ట్రం రావటంలేదనీ, ఎన్నికల్లో పొరపాటుగా ఎవరికో ఓటు వేసామని సెల్ టవర్లెక్కో, టాంకు బండమీదనుచీ దూకో, వంటికి నిప్పంటించుకునో, ఎండ్రిన్ మింగో, ఫానుకు చున్నీ బిగించుకునో కన్నవారి కడుపుకి కోత మిగల్చటం ఎంత తెలివితక్కువతనం, ఎంత విచారకరం!

రాజు ఆటకట్టటానికి బంట్లు చావడమన్నది చదరంగం ఆట రూలు మాత్రమే. నిజ జీవితంలో ఎన్ని కోట్ల బంట్లు ప్రాణాలు పోగొట్టుకున్న రాజుల ఆట ఆగదు. ఫలానా తేదీకి మనం పోతామన్న కవరు జేబులో ఉన్నా ఆ పోయే చివరి క్షణందాకా మనిషిలాగా బ్రతకటమే మనిషి చేయాల్సిన ధైర్యం. చావటానికెన్నో దారులున్నాయి. బ్రతకటానికొక్కటే దారి. చివరిదాకా ఆ దారిలో సాగిపోయే వారికే విజయం ఎదురుగా వస్తుంది. బ్రతకటానికుండాలిగాని.. చావటానికెందుకంత తొందర? ఆ సమయం ముంచుకొస్తే దానంతట అదే ఏ మున్సిపాలిటీ చెత్తకుప్పో మీద పడనే పడుతుంది. బోరుబావో, మ్యాన్ హోలో తెరుచుకుంటుంది. బస్సులు, రైళ్ళు, విమానాలు, బాంబులు, పోలీసులు ఉండనే ఉన్నాయి.

Post your comments